త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి అభినందన సత్కారం

దశ, హైదరాబాద్ : త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనా రెడ్డి తన పర్యటనలో భాగంగా హైదరాబాద్ నగరానికి వచ్చిన సందర్భంగా బీజేపీ సీనియర్ నేత వై. కృష్ణ, బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు ల నేతృత్వంలో పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపికను బహుకరించారు.కేంద్రంలోనరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్నప్రజా ప్రయోజన పథకాలు,సామాజిక అభివృద్ధి,తదితర అంశాలపై వారు గవర్నర్ తో చర్చించారు.

గద్వాల్ వీవర్స్ సొసైటీ శారీస్‌లో సుమా కనకాల సందడి



దశ, హైదరాబాద్ : జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 55లో పెద్దమ్మ తల్లి టెంపుల్ సమీపంలో గద్వాల్ వీవర్స్ సొసైటీ శారీ షాప్‌ను యాంకర్ సుమా కనకాల, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తోపాటు రాంగోపాల్ అగర్వాల్ & ఆకాష్ అగర్వాల్ కలసి ప్రారంభించారు. భారతీయ చేనేత కళా సంపదను సంరక్షిస్తూ, నేత కార్మికుల జీవనోపాధిని బలోపేతం చేయాలనే లక్ష్యంతో 1986లో శ్రీరాం గోపాల్ స్థాపించిన గద్వాల్ వీవర్స్ సొసైటీ నాలుగు దశాబ్దాలుగా విశిష్ట సేవలు అందిస్తోంది. గద్వాల్ ప్రాంతానికి చెందిన సాంప్రదాయ నేయకళను పరిరక్షిస్తూ, దేశవ్యాప్తంగా ఉన్న వివిధ చేనేత సంప్రదాయాలను ఒకే వేదికపైకి తీసుకురావడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది. సాంప్రదాయంగా గద్వాల్ చీరలు స్వచ్ఛమైన పత్తితో మాత్రమే నేయబడేవి. కాలానుగుణంగా వినియోగదారుల అభిరుచులను దృష్టిలో ఉంచుకుని, సంప్రదాయ నైపుణ్యాన్ని కొనసాగిస్తూ సిల్క్‌కాటన్ గద్వాల్ చీరలు, స్వచ్ఛమైన పట్టు గద్వాల్ చీరలను కూడా ప్రవేశపెట్టారని సుమా తెలిపారు.

కార్పెంటర్ యూనియన్ సెక్రటరీ మృతి పట్ల సంతాపం

❖ సిపిఐ మండల కార్యదర్శి తోకటి కుమార్

దశ,పినపాక:- మండల పరిధిలోని ఏడూళ్ళ బయ్యారం గ్రామంలో కార్పెంటర్ యూనియన్ మండల అధ్యక్షుడు కోయిలకుంట్ల రమణాచారి మంగళవారం ఉదయం స్వర్గీయులు అయ్యారు. మృతి చెందడం పట్ల సిపిఐ పినపాక మండల కార్యదర్శి తోకటి కుమార్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సిపిఐ కార్యదర్శి మాట్లాడుతూ.. ప్రధానంగా ఏఐటీయూసీలో కీలక పాత్ర పోషించారని,ఎన్నో ఏళ్లుగా పార్టీకి అండదండగా ఉంటూ ఎన్నో ఫారెస్ట్ దాడులను కూడా లెక్కచేయకుండా శ్రమించరని, సంఘానికి తీరని లోటని ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పత్తిపాటి నాగేశ్వరరావు, గడ్డం మనోహర్ చారి, సిపిఐ సీనియర్ నాయకులు పద్మనాభ రాజు, మండల సహాయ కార్యదర్శులు కప్పా వెంకటేశ్వర్లు, రమేష్,గడ్డం వెంకటచారి, శివారపు బ్రహ్మం,తదితరులు పాల్గొన్నారు.

మర్రిపల్లి చెరువుపై కబ్జాదారుల కబంధహస్తం

❖ ప్రజావాణి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హైడ్రా!

❖ ఎఫ్ టి ఎల్ పరిధిలో 5 ఎకరాల మట్టి కబ్జా తొలగింపు.. అక్రమ షెడ్ల నిర్మాణాలకు చెక్

దశ, అబ్దుల్లాపూర్‌మెట్: రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మర్రిపల్లి గ్రామంలోని చెరువును కబ్జా చేసేందుకు సాగిన అక్రమ యత్నాలను హైడ్రా అడ్డుకుంది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టిన అధికారులు, చెరువు పూర్తి స్థాయి నీటి నిల్వ (FTL) పరిధిలో సుమారు 5 ఎకరాల మేర మట్టి పోసి ఆక్రమించిన ప్రాంతాన్ని గుర్తించి తొలగింపు చర్యలు చేపట్టారు.

స్థానికుల కథనం ప్రకారం, చెరువు భూమిని క్రమంగా ఆక్రమిస్తూ మట్టి నింపడం, తాత్కాలిక షెడ్ల నిర్మాణాలు చేపట్టడం ద్వారా ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ విషయంపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత శాఖలు స్పందించకపోవడంతో ప్రజలు ప్రజావాణిని ఆశ్రయించారు.

ఫిర్యాదును తీవ్రంగా పరిగణించిన హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, 31.05 ఎకరాల విస్తీర్ణం ఉన్న మర్రిపల్లి చెరువు FTL హద్దులను నిర్ధారించారు. అనంతరం ఆక్రమణకు గురైన ప్రాంతంలో వేసిన మట్టిని తొలగించి, అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించే చర్యలు చేపట్టారు.

చెరువులపై కన్నేసిన భూకబ్జాదారులు

ఇటీవల హైదరాబాద్ శివారుప్రాంతాల్లోచెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములపై కబ్జాల పరంపర పెరుగుతుండగా, మర్రిపల్లి చెరువు ఘటన మరోసారి ఆందోళన కలిగిస్తోంది. చెరువుల పరిరక్షణ లేకపోతే భవిష్యత్తులో వర్షాకాలంలో వరద ముప్పు, భూగర్భ జ లా ల క్షీణత వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఫెన్సింగ్‌తో రక్షణ చర్యలు

చెరువు భూమి మళ్లీ ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు హైడ్రా అధికారులు FTL హద్దుల వెంట ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

అదే సమయంలో చెరువు సమీపంలోని రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పొలాలకు వెళ్లే మార్గాన్ని గుర్తించి, ఆ దారిని వదిలిపెట్టి మిగిలిన అక్రమ మట్టిని పూర్తిగా తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములపై ఎలాంటి ఆక్రమణలు జరిగినా కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ప్రజల ఫిర్యాదులకు వెంటనే స్పందిస్తూ సహజ వనరుల పరిరక్షణకు హైడ్రా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజావాణి ఫిర్యాదు.. హైడ్రా చర్య.. మర్రిపల్లి చెరువుకు ఊపిరి! అంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జానంపేట గ్రామపంచాయతీ అక్రమాల ఆరోపణలపై రాజకీయ దుమారం

దశ, పినపాక :- జానంపేట గ్రా మ పం చా య తీ లో అక్రమాలు జరిగాయంటూ బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పే బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ నిధుల వినియోగానికి సంబంధించిన ప్రతి అంశాన్ని గ్రామసభల్లో ప్రజలకు వెల్లడిస్తున్నామని తెలిపారు. గత పాలనలో జరిగిన ఖర్చులు, బిల్లులు, తీర్మానాలపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని సవాల్ విసిరారు. డీజిల్ ఖర్చులు, విద్యుత్ సామగ్రి కొనుగోళ్లు, ఇతర అభివృద్ధి పనుల వివరాలతో ప్రజల ముందుకు రావాలని బీఆర్ఎస్ నాయకులను కోరారు. ప్రజా పాలనను చూసి ఓర్వలేక నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గ్రామాభివృద్ధి అంశాలపై ఆధారాలతో చర్చించేందుకు తేదీ, స్థలాన్ని నిర్ణయించాలని సూచించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలకు స్వస్తి పలకాలని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

RS ప్రవీణ్ కుమార్ హత్య కు రేవంత్ రెడ్డి కుట్ర

❖ రుద్రవరం సునీల్ ఓయూ జాక్ నాయకుడు

దశ ఓయూ: 26 సంవత్సరాల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లో ప్రాణాలకు తెగించి పోలీస్ శాఖలో పని చేసిన Dr.RS ప్రవీణ్ కుమార్ కు బుల్లెట్ ప్రూఫ్ వాహనం, భద్రతను కొనసాగించాలని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు రుద్రవరం సునీల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. మావోయిస్టులు, వారి సానుభూతి పరుల నుండి ముప్పు ఉన్నదని ఆనాటి ప్రభుత్వాలు బుల్లెట్ ప్రూఫ్ కారును, భద్రతను కొనసాగిస్తూ ఉంటే... ఈనాటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసే అరాచకాలను, అవినీతి, అన్యాయాలను ప్రశ్నిస్తున్నాడని, కక్షపూరితంగా బుల్లెట్ ప్రూఫ్ కార్ ను, సిబ్బందిని తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హత్యకు రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ప్రజల తరపున కొట్లాడే RSP ని లక్ష్యంగా చేసుకొని విమర్శలకు సమాధానం చెప్పే ధైర్యం లేక ప్రవీణ్ కుమార్ ను ఖతం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయని తెలిపారు. ఆయన ప్రాణాలకు ఏమైనా అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే పూర్తి బాధ్యత వహించాలని, రాష్ట్రవ్యాప్తంగా బహుజన సమాజం నుండి పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో SSU అధ్యక్షులు మొగిలిపాక నవీన్, విద్యార్థి నాయకులు భూషిపాక గణేష్, ఏరోళ్ల రామచంద్రం, కుమార షాను, లింగాల అనిల్ రాజ్, ఈసంపల్లి రాజు, దాసు, చంద్ర శేఖర్ రెడ్డి, అశోక్, ప్రవీణ్, కరుణాకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో అభివృద్ధి పనుల జోరు

❖ రూ.1.65 కోట్ల వ్యయంతో పలు పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు.

❖ బాటసింగారంలో నూతన గోదాముకు శంకుస్థాపన – అనాజ్‌పూర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి.

దశ, రంగారెడ్డి: అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం అభివృద్ధి కార్యక్రమాలు సందడిగా సాగాయి. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే శ్రీ మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో బాటసింగారంలో నూతన గోదాముకు శంకుస్థాపన చేయడంతో పాటు కవాడిపల్లి, లష్కర్‌గూడ, అనాజ్‌పూర్, గండిచెరువు గ్రామాల్లో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మొత్తం రూ.1.65 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పనులు గ్రామాల అభివృద్ధికి ఊతమివ్వనున్నాయి.

కవాడిపల్లిలో రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించగా, లష్కర్‌గూడలో మరో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రజలకు అంకితం చేశారు. అనంతరం అనాజ్‌పూర్ గ్రామంలో హెచ్ఎండీఏ నిధులతో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గండిచెరువులో రూ.25 లక్షలతో సీసీ రోడ్డు, రూ.15 లక్షలతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. బాటసింగారంలో నూతన గోదాముకు శంకుస్థాపన చేసి రైతులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

అనాజ్‌పూర్‌కు మరిన్ని నిధులు – ప్రతి అర్హుడికి ఇందిరమ్మ ఇల్లు

అనాజ్‌పూర్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిచేస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలోనే అత్యధిక ఇందిరమ్మ ఇళ్లను అనాజ్‌పూర్‌కు మంజూరు చేశామని, ఇల్లు లేని ప్రతి అర్హ లబ్ధిదారుడికి దశలవారీగా ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు,నాయకులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, బాటసింగారం సహకార బ్యాంకు చైర్మెన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి , మేనేజర్ ఐలేష్ , తహశీల్దార్ సుదర్శన్ రెడ్డి , అనాజ్‌పూర్ గ్రామ సర్పంచ్ రాచపాక నవనీత మహేష్, పంచాయతీరాజ్ డీఈ ఇంద్రసేన రెడ్డి, ఎంపీడీఓ స్రవంతి, ఏఈ సూర్యతేజ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కంప్యూటర్ సాఫ్ట్ వేర్ కోర్సుల్లో ఆన్ లైన్ ద్వారా ఉచిత శిక్షణ

దశ, హైదరాబాద్ : స్వర్ణ తెలంగాణ స్వయం ఉపాధి శిక్షణ పథకం ద్వారా 36వేల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా 100కు పైగా వివిధ కంప్యూటర్ సాఫ్ట్ వేర్ కోర్సుల్లో ఆన్ లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఏ. వెంకట్ రెడ్డి తెలిపారు. ఆన్ లైన్ ఈ లెర్నింగ్ ద్వారా కోర్స్ పూర్తిచేసిన యువతకు కేంద్ర ప్రభుత్వం ఆమోదంచే నేషనల్ స్కిల్ అకాడమీ ద్వారా సర్టిఫికెట్ అందజేయడం జ రు గు తుం ద ని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తిగల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని స ద్వి ని యో గం చేసుకోవాలని ఆయన కోరారు. నేటి సమాజంలో పేద, మధ్యతరగతి విద్యార్థిని విద్యార్థులకు, నిరుద్యోగ యువతీ యువకులకు అత్యధిక జీత భత్యాలు, ఉద్యోగ అవకాశాలు గల కంప్యూటర్ సాఫ్ట్వేర్ రంగంలో ఆన్లైన్ శిక్షణ అందించడం ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కంప్యూటర్ సాఫ్ట్వేర్ శిక్షణ రంగంలో 34 సంవత్సరాల అనుభవం గల పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థ నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా లేటెస్ట్ కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల్లో ఆన్లైన్ లో శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకం క్రింద ఏఐ, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి 100 కోర్సులు ఎలాంటి కోర్స్ ఫీజు లేకుండా ఆన్ లైన్ ఈలెర్నింగ్ ద్వారా శిక్షణను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు విదేశాలలో అధిక వేతనాలతో ఉత్తమ ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. స్వర్ణ తెలంగాణ స్వయం ఉపాధి శిక్షణా పథకం ద్వారా రూ.1,50,000 వరకు కోర్స్ ఫీజులు గల వివిధ లేటెస్ట్ కంప్యూటర్ సాఫ్ట్వేర్ డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులు ఎలాంటి కోర్స్ ఫీజు లేకుండా నేర్చుకొని సాఫ్ట్వేర్ రంగంలో ఉద్యోగాలు పొందాలని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థినీ విద్యార్థులు, నిరుద్యోగ యువతీ యువకులు జూలై 31వ తేదీ లోగా ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ సైట్: www.pacecomputers.org వివరాలకు ఫోన్: 9505800047.

జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
గురువారం
25-06-2026

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ఖమ్మం | వైరా | సత్తుపల్లి | పాడేరు | మధిర
భద్రాద్రి కొత్తగూడెం | కొత్తగూడెం | ఇల్లందు | పినపాక | భద్రాచలం | అశ్వరావుపేట
WWW.DASHANEWS.COM

కరకగూడెంలో రహదారుల మరమ్మత్తు పనులు

దశ, కరకగూడెం: గ్రామపంచాయతీ పరిధిలో వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బురదమయమైన రహదారులపై గ్రావెల్ మట్టి పోయింపు పనులను సర్పంచ్ పోలేబోయిన సుజాత, ఉప సర్పంచ్ బుడగం రాము బుధవారం ప్రారంభించారు. పోలీస్ స్టేషన్, ఎంఆర్ఓ కార్యాలయం సమీప ప్రాంతాలతో పాటు పుష్కర ఘాట్ పెద్దవాగు వరకు ఈ పనులు చేపట్టారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ పనులను పరిశీలించి గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పంచాయతీ కట్టుబడి ఉందన్నారు. వర్షాకాలంలో రాకపోకలకు ఆటంకాలు లేకుండా ముందస్తు చర్యగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ గుండ్ల సంతోష్, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిష్ మార్కెట్ వద్ద హై లెవెల్ బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

దశ,మణుగూరు: మున్సిపాలిటీ పరిధిలోని ఫిష్ మార్కెట్ ప్రాంతంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న హై లెవెల్ బ్రిడ్జి పనులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఫిష్ మార్కెట్ ప్రాంతంతో పాటు పరిసర కాలనీల ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా డీడీఆర్ఎఫ్ బృందాలు: ఎస్పీ రోహిత్ రాజ్

దశ, అశ్వాపురం: మండలంలోని తుమ్మలచెరువు వద్ద నిర్వహిస్తున్న డీడీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖల సంయుక్త శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ పరిశీలించారు. శిక్షణ శిబిరాన్ని సందర్శించిన ఆయన సిబ్బందికి అందుతున్న శిక్షణ తీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. రాబోయే వర్షాకాలంలో సంభవించే వరదలు, ఇతర విపత్కర పరిస్థితుల్లో బాధితులను రక్షించేందుకు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డీడీఆర్ఎఫ్ బృందాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయని తెలిపారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక శిక్షణ పొందిన బృందాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రధాన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ ఎల్లయ్య, ఆర్ఐబీ రవి, ఎస్సై రాజేష్, అగ్నిమాపక శాఖ అధికారులు, డీడీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు అందజేత

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బ్యూరో : మణుగూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధి కోసం బిటిపిఎస్ సీఈ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల కింద రూ.1.45 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ అంకిత్‌కు బుధవారం అందజేశారు. ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ చెక్కును అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు సహకరించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో సీఎస్ఆర్ నిధులు కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సమాజాభివృద్ధిలో భాగంగా మరిన్ని సంస్థలు కూడా విద్యారంగానికి చేయూతనివ్వాలని కోరారు. బిటిపిఎస్ సీఈ బిచ్చన్న మాట్లాడుతూ, మణుగూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అవసరమైన అభివృద్ధి పనుల కోసం ఈ నిధులను వినియోగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఓ సంజీవరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆశ్రమ గురుకుల పాఠశాలలో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం

- *24 గంటల్లో పరిశుభ్రత చర్యలు పూర్తి చేయాలని ఆదేశం*
- *ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సూచన*

దశ,అశ్వాపురం: మండలంలోని జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం విస్తృతంగా పర్యటించి విద్యాసంస్థలు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గొందిగూడెం గిరిజన ఆశ్రమ గురుకుల బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల, పాఠశాల ఆవరణను పరిశీలించారు. కంప్యూటర్ ల్యాబ్‌లో కంప్యూటర్లు దుమ్ము, ధూళితో అపరిశుభ్రంగా ఉండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, నాలుగు నెలల క్రితం సూచనలు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంప్యూటర్ ఇన్‌స్పెక్టర్ కాంట్రాక్టును రద్దు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వంటశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలు కావడం లేదని గుర్తించి హాస్టల్ వార్డెన్‌ను వివరణ కోరారు. విద్యార్థుల సంఖ్య ఎంత ఉన్నప్పటికీ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. వసతి గృహాలు, పాఠశాల ఆవరణలో పరిశుభ్రత లోపాలను గమనించిన కలెక్టర్, ప్రధానోపాధ్యాయుని గది మినహా మిగతా ప్రాంతాల్లో నిర్వహణ సరిగా లేదని అసహనం వ్యక్తం చేశారు. 24 గంటల్లో పూర్తిస్థాయిలో పరిశుభ్రత చర్యలు చేపట్టి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత లోపాలు, మెనూ అమలులో నిర్లక్ష్యంపై హాస్టల్ వార్డెన్‌కు మెమో జారీ చేయాలని సూచించారు.

అనంతరం కొత్తూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించి విద్యాభ్యాసం, మధ్యాహ్న భోజన నాణ్యత, హాజరు నమోదుపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరును ప్రతిరోజూ యాప్‌లో సక్రమంగా నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. తర్వాత ఎలకలగూడెం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించిన కలెక్టర్, ఇంటింటి సర్వే, దరఖాస్తుల పరిశీలన, యాప్‌లో నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. అర్హులైన ప్రతి కుటుంబాన్ని గుర్తించి పారదర్శకంగా, సమర్థవంతంగా సర్వే నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. అశ్వాపురం మండలంలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి మొత్తం 3,448 దరఖాస్తులు ఎల్1 స్థాయిలో ఉండగా, వాటిలో 2,075 దరఖాస్తుల సర్వే పూర్తయిందని ఎంపీడీవో కలెక్టర్‌కు వివరించారు. మండలంలో ఇప్పటివరకు 409 గుడిసెలను గుర్తించినట్లు తెలిపారు. మిగిలిన దరఖాస్తుల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ఎంపీడీవోతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐటీసీ కార్మికులు ఆపద్బాంధవులు..

క్షతగాత్రరాలకి ఆర్థిక చేయూత..

దశ బూర్గంపాడు: మండల పరిధిలోని సారపాక గ్రామంలో ప్రముఖ పరిశ్రమ పేపర్ కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులు ఒక అభాగ్యురాలకు ఆర్థిక చేయూతనందించి ఆపద్బాంధవులగా మిగిలారు. సారపాక గ్రామంలో ఇటీవల వినాయక గుడిలో ధ్వజస్తంభం ప్రతిష్ట లో జరిగిన ప్రమాదంలో గాయ పడిన మహిళ కి బుధవారం ఐ టి సి పి ఎస్ పి డి ఎస్ఆర్పి (మెకానికల్) , ఎస్ఆర్పి మేనేజర్స్ కలిసి 28,300/ కుటుంబానికి అందచేయడం అందజేశారు. గతంలో కొందరు దాతల సహకారంతో వైద్య ఖర్చులు నిర్వహించగా తిరిగి మళ్లీ వైద్య ఖర్చులకోసం సహాయం కోరగా స్పందించిన కార్మికులు బుధవారం ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలబడటం కోసం మండలంలో చాలామంది దాతలు ఉండటం అదృష్టమని ఎలాంటి ఆపదొచ్చిన చేసేది. చిన్న సహాయం అనుకోకుండా సహాయం అందిస్తే ఎన్నో అభాగ్య కుటుంబాలకు అండగా నిలబడతారు. బాధిత కుటుంబాలకు కొండత మేలు అవుతుంది. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి రాజకీయ పార్టీల సహకారం అవసరం: కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో: ఐడీఓసీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియ, ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణ విధానం, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ నమోదు ప్రక్రియలపై అవగాహన కల్పించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలను సేకరిస్తారని కలెక్టర్ తెలిపారు. జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి, అభ్యంతరాల పరిశీలన అనంతరం అక్టోబర్ 1న తుది జాబితా ప్రకటించనున్నట్లు వెల్లడించారు. వలస వెళ్లిన, మరణించిన, డూప్లికేట్ ఓటర్ల పేర్లను తొలగించి, అర్హులైన కొత్త ఓటర్లను ఫారం6 ద్వారా నమోదు చేయనున్నట్లు చెప్పారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే యువత కూడా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నంబర్ 1950ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

- *ఐటీసీ కార్మికులకు డ్రగ్స్‌పై అవగాహన అవసరం*
- *ఎస్ఐ మేడా ప్రసాద్*

దశ, బూర్గంపాడు: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని,మత్తు పదార్థాల వల్ల కుటుంబాలు నాశనమవుతాయని, డ్రగ్స్ వాడకం, విక్రయానికి పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని బూర్గంపహాడ్ ఎస్ఐ మేడా ప్రసాద్ హెచ్చరించారు. సారపాకలోని ఐటీసీ కర్మాగారంలో కార్మికులకు డ్రగ్స్ దుష్ప్రభావాలపై బుదవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కార్మికులకు సూచించారు. "మత్తు పదార్థాల వల్ల ఒక్కరి జీవితమే కాదు, మొత్తం కుటుంబం రోడ్డున పడుతుందని చెప్పారు. ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసులు నమోదైతే జీవితం జైలుపాలవుతుంది అని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తున్నా, సరఫరా చేస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఐటీసీ కర్మాగార అధికారులు, సిబ్బంది, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏఐటీయూసీ దీక్షలకు మద్దతు తెలిపిన వారందరికీ సీపీఐ కృతజ్ఞతలు

దశ,మణుగూరు: 'మణుగూరు సేవ్' పేరుతో సింగరేణి 2 డిప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణికే అప్పగించాలని, మణుగూరు ఓసీ పర్మిషన్ ఎక్స్‌టెన్షన్ తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల రిలే దీక్షలకు మద్దతు తెలిపిన వారందరికీ సీపీఐ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్లు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార వర్గాలు, విద్యాసంస్థలు, చాంబర్ ఆఫ్ కామర్స్, వివిధ సంఘాల ప్రతినిధులు దీక్షలకు సంపూర్ణ మద్దతు అందించారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేసిన ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులతో పాటు సహకరించిన పోలీసు శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ఎడారి రమేష్, సోందే కుటుంబరావు, గడ్డం వెంకటేశ్వర్లు, తోట రమేష్, కొత్తపల్లి సీతారాములు, ఎస్‌కే సర్వర్, ఆదర్ల రాములు తదితరులు పాల్గొన్నారు.